మనోజ్‌కు బెస్ట్ అడ్వకేట్ అవార్డు

అమలాపురం టౌన్: ముంబై ఎస్‌వీకేఎం ప్రవీణ్ గాంధీ కాలేజ్ ఆఫ్ లా ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించిన నేషనల్ ట్రైల్ అడ్వకసీ-జడ్జిమెంట్ రైటింగ్ కాంపిటీషన్-2023 కార్యక్రమంలో తనకు బెస్ట్ అడ్వకేట్ అవార్డు వచ్చిందని అమలాపురానికి చెందిన న్యాయ శాస్త్ర విద్యార్థి మాకిరెడ్డి మనోజ్ తెలిపారు. ముంబై హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఉమేష్ దత్తాత్రేయ సాల్వీ చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసా పత్రం, రూ.7 వేల నగదు బహుమతిగా అందుకున్నానన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి, ఉప్పలగుప్తం గ్రామాల సరిహద్దులో గొరగనమూడి మీడియం డ్రెయిన్ ప్రాంతంలో మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిద్దరినీ 108 సహాయంతో అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.


గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు


సన్నవిల్లిలో శాకంబరీ దేవిగా కనకదుర్గ అమ్మవారు


కనకాలపేటలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


నీలపల్లిలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


దొమ్మేటిపేటలో లక్ష కుంకమార్చనలో భక్తులు

శక్తి స్వరూపిణి.. ముక్తిదాయిని..

అమలాపురం టౌన్/ఐ.పోలవరం/ఉప్పలగుప్తం/యానాం/తాళ్లరేవు/అమలాపురం రూరల్: దసరా నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని ఊరూరా అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. అమలాపురం పట్టణంలోని గోల్డ్ మార్కెట్‌లో ఉన్న శ్రీకామాక్షీ ఏకాంబరీశ్వరదేవి ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు వైభవంగా జరిగాయి. స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వైష్ణవీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా అలంకృతయ్యారు. అమలాపురం మండలం కామనగరువులో జీఎస్ఆర్ లేఔట్ కాలనీలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పలగుప్తం మండలం మండలంలోని సన్నవిల్లి గ్రామంలో కనకదుర్గ అమ్మవారిని మంగళవారం వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలకరించారు. యానాం నియోజకవర్గ పరిధిలోని కనకాలపేటలో


వీరేశ్వరస్వామి ఆలయంలో లలితా సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు

కొలువైన శ్రావణి అమ్మవారు మంగళవారం గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దొమ్మేటిపేటలో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన ఘనంగా జరిగింది. తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురికి అన్నదానం చేశారు. నీలపల్లిలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి విశేష పూజలు


కామనగరువులో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

నిర్వహించారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా నిర్వహించిన లలితా సహస్ర నామ అహోరాత్ర పారాయణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 24 గంటల పాటు మహిళలు లలితా పారాయణ చేశారు. లలితాపారాయణ చేయడానికి వచ్చిన భక్తులకు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు గాజులు, కుంకుమ, శేషవస్త్రం, ప్రశంసాపత్రం, ప్రసాదాలను అందజేశారు.

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర

ముమ్మిడివరం: 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ మార్కాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జిలానీ బాషా చేపట్టిన పాదయాత్ర మంగళవారం ముమ్మిడివరం చేరుకుంది. బాషాకు నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, కాశీ బాలమునికుమారి, బొంతు సత్యశ్రీనివాస్ తదితరులు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా జిలానీ బాషా మాట్లాడుతూ మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు.


పాదయాత్ర చేస్తున్న జిలానీ బాషాను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

19న విద్యుత్ వినియోగదారుల సమావేశం

ముమ్మిడివరం: ఏపీఈపీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఈనెల 19న నిర్వహిస్తామని అమలాపురం డివిజనల్ ఈఈ మోకా రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల ఫోరం చైర్మన్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగే పరిష్కార వేదికలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

అమలాపురం టౌన్: ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అన్నారు. స్థానిక సూర్యనగర్ వార్డు సచివాలయంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్ వాసర్ల లక్ష్మి పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని నంగవరం సచివాలయ ఆవరణలో సన్నవిల్లి, నంగవరం గ్రామాల ప్రజలకు సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 462 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సన్నవిల్లి సర్పంచ్ చిక్కం జంగమయ్య, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, శీలం సూరిబాబు, ఎంపీడీవో ఎం.వెంకటేశ్వర ప్రసాద్, ఈఓపీఆర్‌డీ కేఎస్ గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని భైరవపాలెం సచివాలయం వద్ద సర్పంచ్ పెమ్మాడి భవాని అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 470 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఝాన్సీకుమారి, పెమ్మాడి బాబూరావు, పినబోతు వీర్రాజు, కాలాడి నూకరత్నం, కాలాడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.


తాళ్లరేవులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్


అమలాపురంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణికి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


పేరూరు కొంకాపల్లిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచ్ అరుణ తదితరులు


ఎంట్రుకోనలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

తాళ్లరేవు: స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 460 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, ఎంపీటీసీ సభ్యులు నందికోళ్ల శ్రీదేవి, రత్స ముత్యాలు, ఆకుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు కొంకాపల్లి సచివాలయం వద్ద ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచ్ దాసరి అరుణల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, ఉపసర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బురామ్, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని ఎంట్రుకోన సచివాలయం వద్ద సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 382 మంది రోగులు వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, మాజీ సర్పంచ్‌లు మొల్లేటి సత్యసాయిబాబు, వాసర్ల శ్రీమన్నారాయణ, సాపే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

తాళ్లరేవు: మండలంలోని సీతారామపురంలో జగనన్న కాలనీలో పట్టాలిచ్చిన లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పలువురు లబ్ధిదారులతో కలిసి జగనన్న కాలనీని సందర్శించిన ఆయన నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలి

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలని అవసరముందని శాఖా గ్రంథాలయ ఇన్‌చార్జి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకు ఇష్టం' కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దసరా సెలవుల్లో గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న ఈ పఠన శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సాయి సంజీవిని మహిళా వాకర్స్ యోగా ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత, కవులు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.


అమలాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో వాహనమిత్ర పథకంలో లబ్ధి పొందిన ఆటోడ్రైవర్లు మంగళవారం స్థానిక సచివాలయం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చేగొండి పెద్దిరాజు, శ్రీను ఆధ్వర్యంలో క్షీరాభిషేకం జరిగింది. కార్యక్రమంలో కడలి లక్ష్మణరావు, భూపతి మోహన్‌రావు, కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ కల్యాణ్‌వర్మ, కల్యాణి, ఈశ్వర్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరం మన్నానగర్ కాలనీకి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. సోమవారం నుంచి బాలిక కనిపించడం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అమలాపురం తాలుకా ఎస్ఐ అందే పరదేశి మంగళవారం తెలిపారు.

ఏపీసీసీలో మరో ఇద్దరికి పదవులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన మరో ఇద్దరు కాంగ్రెస్ నాయకులకు ఏపీసీసీలో పదవులిచ్చారు. ఏపీసీసీ ఉపాధ్యక్షులుగా ముషిణి రామకృష్ణారావు, కొత్తూరి శ్రీనివాసరావులు నియమితులయ్యారు. ఇటీవల పట్టణానికి చెందిన అయితాబత్తుల సుభాషిణి ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంగతి తెలిసిందే. కొత్తగా పదవులు చేపట్టిన రామకృష్ణారావు, శ్రీనివాసరావులను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మంగళవారం అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం


అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం రూరల్: మండలంలోని రోళ్లపాలెంలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో రాయుడు సత్యనారాయణకు చెందిన రెండు పోర్షన్ల తాటికిల్లు దగ్ధమైంది. ప్రమాదంతో సత్యనారాయణతో పాటు మరో కుటుంబం నిరాశ్రయులయ్యారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు బాధితులను మంగళవారం పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఆస్తి పన్ను వాటా మున్సిపాలిటీకి బదిలీ

యానాం: జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్ల రిజిస్ట్రేషన్ శాఖల ద్వారా వచ్చిన ఆస్తి పన్ను వాటాగా యానాం మున్సిపాలిటీకి రూ.34,48,367 సొమ్ము బదిలీ చేస్తూ పుదుచ్చేరి రెవెన్యూ కార్యదర్శి ఇ.వల్లవన్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.